# మగబుద్ధి

## పూడిపెద్ది సత్యాలక్ష్మి

సరిగ్గా మాపెళ్ళయి మూడ్నెల్లయింది ఈ మూడు నెలల్లో మేమిద్దరం ఒకర్నొకరు వదిలి ఉండలేని స్థితికి వచ్చాం. కొత్త ఊరు కొత్త వాతావరణం బాగా అలవాటయిపోయాయి మా శ్రీమతికి ఇటు మాతల్లిదండ్రులకి అటు మా శ్రీమతికి తల్లి దండ్రులకీ చాలా దూరంలో ఉన్నప్పటికి ఎవరికి ఉత్తరాలు వ్రాయటాన్కి కూడా తీరిక లేనంతగా ఉండేవాళ్ళం ఆఫీసు పూర్తయిన వెంటనే ఇంటికి చేరుకుని తలుపులు బిడాయించుకుని- ఇంట్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ- నవ్వుతూ, తుళ్ళుతూ, కాలం గడిపేస్తున్నాం- నిన్ను చేసుకోవటం నా అదృష్టం అంటే- నువ్వు దొరకటం నా అదృష్టం అంటూ ఒకర్నొకరు తెగ అభినందించుకుంటూ ఉండేవాళ్ళం మా కాలనిలో అంతా వెటకారం కూడా చేస్తూ ఉండేవారు 'ఎంత కొత్తగా పెళ్ళయిన దంపతులైనా- మరి ఇంతలా- బైట కైనా రాకుండా రోజులు గడిపేస్తున్నామని'.

మా ఆఫీసులో సరేసరి –"ఏమోయ్ మోహన్‌రావ్ – నిన్న భూకంపం వచ్చింది తెల్సా' అని అడిగి – అవున్లే నీకెందుకు తెలుస్తుంది – కొత్తగా పెళ్ళయింది కదూ! అంటూ ఆటపటిస్తూ ఉండేవారు

ఇంత చక్కగా రోజులు గడిచిపోతున్న క్షణంలో – మాకో టెలిగ్రాం వచ్చింది "స్టార్ట్ ఇమ్మీడియట్లీ' అంటూ మా మావగారి దగ్గర్నుండి.

సంగతేంటో తెలియని మేం తెగ గాబరా పడుతూ –గబగబా సామాన్లు సర్దుకుని –ఆఫీసుకి శలవు పెట్టుకుని మా అత్తవారి ఊరైన బరంపురం చేరుకున్నాం

రైల్వేస్టేషన్ నుండి ఇంటి కెళ్ళేంత వరకూ టెన్షన్ భరించలేకపోయినా మేం ఇంటి కెళ్ళేసరికి – మా మరదలు నవ్వుతూ రిసీవ్ చేసుకోటం – చూసి – హమ్మయ్య అంటూ తేలిక పడ్డాం – జరక్కూడనిదేది జరగనందుకు.

'ఏమే జాకీ (ఇది మా మరదలికి ముద్దుగా నేను పెట్టుకున్న పేరు) టెలిగ్రాం ఇచ్చి పిలిపించారు – కొంపలంటుకున్నట్లు, ఎందుకేంటి' – అన్నాను పలకరిస్తూ.

'గుమ్మంలో అడుగు పెడుతూనే ఎంటా తొందర – అయినా కొంపలంటుకుంటే ఫైర్ సర్వీసుకు కబురు పెడ్తాం గానీ – నిన్నెందుకు పిలుస్తాం' – అంది.

ఇంట్లో కెళ్ళగానే- మా శ్రీమతి కూడా అదే ప్రశ్న వేసింది- మా అత్తగార్ని

అబ్బే ఏంలేదమ్మా" అక్కకి నెలలు నిండాయి ఇంక పురుడొచ్చే టైమేనని డాక్టర్ చెప్పారు ఈ లోపున పాపం నిన్ను చూడాల నుందంది- ఇంక ఆ కోరికలా ఉండిపోతే పురుడు రాదేమోనని బెంగపడి- మీ నాన్నగారు టెలిగ్రాం ఇచ్చారు "

'అక్కేది?" అంది ఆతృతగా మా ఆవిడ ఈ లోపునే పెరట్లోంచి మొఖం కడుక్కుని, తుడుచుకుంటూ- వరండాలో చెల్లెల్ని చూస్తూనే

"–సుధా, బాగున్నావా?" అంటూ దగ్గరకొచ్చి వాటేసుకుంది-వాళ్ళ అక్క.

"ఏంటక్కా? మూడ్నెళ్ళకే నా కోసం మొహం వాచిపోయావా? దూరాభారం నుండి శ్రమపడి రావటాన్కి మాతాతలు దిగొచ్చారు- టెలిగ్రాం చూసి- ఎంతగాబరా పడిపోయామో--తెల్సా?"

'తెలుసమ్మా' అలా ఇస్తేనే గాని మీరు రారని తెల్సి- అలా ఇచ్చాను. ఏమోయ్ అల్లుడు కులాసానా, ఎవిటప్పా, చెల్లీ తల్లి కూతుర్లూ పలకరింపు లేనా- అల్లుడ్ని మావగార్ని కాస్త చూస్తారా-" అంటూ ప్రవేశించారు మా మామగారు

ఆరాత్రి నాశ్రీమతి మాకు కేటాయించిన గదిలోకి ప్రవేశించి అందించిన శుభవార్త ఏమిటంటే- వాళ్ళ అక్క పురుడ యెంత వరకూ తను అక్కడుండక తప్పదని.

నా గుండెల్లో రాయి పడింది. "ఇదేం ఖర్మరా భగవంతుడా! పురుడోసుకునేది మీ అక్కయితే- నువ్వెందుకోయ్ ఇక్కడా- అయినా నన్నొదిలి ఉండటాన్ని నీ మనసొప్పుతోంది? అడిగాను.

"నా కుండాలని లేదండీ- కానీ అక్కకిది తొలికాన్పు.-డెలివరి కొంచెం కష్టం అని డాక్టర్ చెప్పిందిట- అందుకని అక్క భయపడుతోంది-' ఈటైంలో నేనుంటే కాస్త ధైర్యంగా ఉంటుందని-" కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ అంది సుధ.

"సరే- పురుడింకో వారం పది రోజుల్లో అవుతుందన్నావ్ కదా! నువ్వుండు నాకు శలవు లేదు- నేను వెళ్ళిపోయి నా తంటాలు నేను పడతాను-" అన్నాను.

మర్నాటి సాయంకాలం రామారావు మాష్టారింటికి ప్రోగ్రాం పెట్టింది-సుధ.

ఆ రామారావు మాష్టారనబడే ఆయన మమ్మల్ని పెళ్ళయ్యాక చూడలేదుట.

రామారావు మాష్టారంటే సుధకి చాలా ఇష్టం- సుధ చెప్పే కబుర్లలో పాతిక శాతం ఆయన గురించే ఉండాలి సుధ అభిమానం ఇంతలా సంపాదించిన ఆ మాష్టార్ని చూడాలని నాకూ ఉండేది.

సరే అని- ఒప్పుకున్నాను.

మర్నాటి సాయంకాలం ఊరి చివర్న ఉన్న రామారావు మాష్టారింటికి చేరుకున్నాం

రామారావు మాష్టారంటే –పంచ-లాల్చీ- పిలక- పొడుండబ్బా- పై మీద కండువా కళ్ళద్దాలు- ఇవన్నీ ఉంటాయనుకున్న నాకు ఆశాభంగమే కల్గింది ఆయన నాకంటే రెండు మూడేళ్ళు పెద్ద ఉంటాడేమో- చక్కని క్రాఫు, పేంటూ షర్ట్‌లో హుందాగా, అందంగా చాలా నీటుగా ఉన్నాడు- మేం వెళ్ళే సరికి ఆయనతో పాటుగా మరో ముగ్గురు మాష్టర్లున్నారు సుమారు ఒకే వయసు వాళ్ళు. ఎవరికి పెళ్ళి కాకపోవటం- మరో విశేషం వెళ్ళగానే మాయిద్దర్ని చూసిన మాష్టారు 'హల్లో సుధప్పలూ- ఏంటి గుర్తున్నాడన్న మాట ఈ దౌర్భాగ్యుడు-" అంటూ పలకరించాడు ఆయన మాటల్లో- కొంత చలాకి, కొంత నిష్ఠూరం ధ్వనించాయి

సుధ నన్ను మాష్టారికి పరిచయం చేసింది- తక్కిన మాష్టర్లు కూడా పరిచయం అయ్యారు-కాఫీలు తెప్పించాడాయన.

చాలా సేపు- ఏవేవో విషయాలు మాట్లాడుకున్నాం అంతవరకూ నా ప్రక్కన కూర్చున్న సుధ- నా దగ్గర్నుండి లేచి వెళ్ళి- ఆయన ప్రక్కన ఖాళీగా ఉన్న కుర్చీని – ఆయనకి మరింత దగ్గరగా లాక్కుని- ఆయన భుజాల మీద చేతులు వేసి –కబుర్లు చెప్పటం ప్రారంభించింది-

సుధ కాస్త అయినింటిలో పుట్టి- అంతకంటే పెద్ద నాగరికత గల్గిన సమాజంలో పెరిగింది. కానీ ఎంతయినా- తెలుగు సాంప్రదాయంలో పుట్టిన మగాడ్ని- అది నేనెంత మాత్రం సహించ లేక పోయాను అయినా అంత మందిలో సుధ నేమన గలను .ఖాళీ అయిన నా ప్రక్క కుర్చీ నన్ను వెక్కిరించింది. నా గుండెలు బరువెక్కి పోయాయి.

సుధకి అందరితో చనువుగా ఉండటం అలవాటే- కానీ- ఈ చనువు మాత్రం నేను సహించ లేక పోతున్నాను. గుండెలలో అగ్ని పర్వతాలు బ్రద్దలౌతున్నట్లు ఫీలవుతూ కూర్చుని –

అన్యమనస్కంగానే మాట్లాడుతున్నాను

రెండు– మూడు– ఐదు– పది–నిముషాలు గడచి పోతున్నాయి– చూసిన వాళ్ళకి వారిద్దరూ భార్యా భర్తల్లా కన్పిస్తారు

నా చేతగాని తనాన్ని చూడలేకో– సుధ ప్రవర్తనని చూడలేకో– తక్కిన ముగ్గురు మాష్టార్లు బయటకి వెళ్ళి గేటుదగ్గర మాట్లాడు కుంటున్నారు సుధ ఏదో జోక్ కట్ చేసింది. నాకు విన్పించ లేదా జోక్– కాని వాళ్ళిద్దరూ పక,పక, విరగబడి నవ్వుకుంటున్నారు

వంటికి గాయాలు చేసే– కారంరాసినట్లనిపించింది నాకు– ఇంక అక్కడుండ లేక పోయాను విస, విసాబయట కొచ్చి– నేను కూడా తక్కిన మాష్టర్లతో పాటు వీధి గేటు దగ్గర నిలబడ్డాను– నేను నిష్క్రమించటం వాళ్ళిద్దరూ– గమనించ లేదు.

బయట వర్షం–హోరుమని కురుస్తోంది.

నా మనసు జోరుమని ఏడుస్తోంది ఏం చెయ్యటాన్కి పాలుపోలేదు

"సుధా ఇంటి కెళ్ళి పోదాం– రిక్షా పిలుస్తా–

అంటూ జవాబు కోసం కూడా ఎదురు చూడకుండా–వర్షంలో బయటకి వచ్చాను

"కాసేపాగండి– వర్షం తగ్గాక వెళ్ళురు గాని– బయట నాతో పాటు నిల్చున్న మాష్టర్లలో ఒకాయన అన్నాడు

లేదండి– ఈ వర్షం ఎప్పటికి తగ్గుతుందో ఏమో– తొమ్మిదయి పోయింది ఇంటి దగ్గరెదురు చూస్తుంటారు '

వదండి– నేనూ వస్తా ' నంటూ మరో మాష్టారు నాతో పాటు వర్షంలో తడుస్తూ వచ్చాడు కాస్త దూరం పోయాక– రిక్షాదొరికింది. మాష్టారిదగ్గర శలవు తీసుకుని– సుధ నేను బయటకొచ్చాం– మాష్టారింటి నుండి మా మావగారిల్లు సుమారు మూడు కిలో మిటర్లుంటుంది. . రిక్షా ఆసామి– వర్షంలో తడిసి పోతూ– రొప్పుతూ లాగుతున్నాడు సుధతో నేనేమి మాట్లాడ లేక పోయాను నా గుండె భారంగా– నా మనసు– అసూయగా– నా శ్వాస వేడిగా నిట్టూరుస్తున్నాయి

ఇల్లొచ్చింది– దిగండి' అన్న మాటతో ఈ లోకంలోకి వచ్చాను రిక్షాకి డబ్బులిచ్చి – ఇంట్లోకి చేరుకున్నాం

"ఏంటలా–ఉన్నారు–' అడిగింది సుధ

"ఎలా? '

'చలాకీగా లేరు '

' నా మనసివాళ ఎందుకో బాగా లేదు "

ఎందుకో? అడిగింది

"తెలీదు."

ఏంటండి మిరే అలా ఉంటారు సర్దాగా, చలాకీగా ఉండే మిరలా ఉంటే ఎలా చెప్పండి? తల నొప్పిగా ఉందా?"

మౌనంగా నా పనులు నెను చేసుకున్నాను సుధ ఏమడిగినా– అన్నింటికి నా సమాధానం మౌనమే... నా గుండె భారం తగ్గించుకుంది? నా బాధ ఎవరితో చెప్పుకోగలను

ఆఖర్కి అతి కష్టంమిద నా గొంతు పెగిలింది– మా గదిలోకి వచ్చిన సుధతోనే నా సంభాషణ ప్రారంభం అయింది


'సుధా– ఎందుకలా ఉన్నానని కదూ అడిగావిందాక .. '

"అవును మి రెందుకో చలాకీగా లేరివాళ.

'ఎందుకో నువ్వు మాష్టారింట్లో ప్రవర్తించిన తీరుకి . "

అదోలా చూసింది– అర్ధంకానట్లు

"అర్ధం కాలేదా? – ఎంత నంగనాచివే–



కట్టుకున్న మొగుడక్కడ కూర్చుంటే- అంతవరకూ ప్రక్కన కూర్చున్న నువ్వు- పరాయి మొగాడి ప్రక్కన- చేరి- ఏక ఏకలూ- పకపకలూనా? ఎంత నీకు మాష్టారయితే మాత్రం- మీ సరసాలు నా ఎదురుగానా?- నువ్వెంత పెద్ద నాగరిక సమాజంలో పెరిగినా సరే? నేను లేనప్పుడు నీ ఇష్టం- నేనుండగా- నా ఎదురుగా ఆ రకంగా ప్రవర్తించకు.

నేను సగటు మగాణ్ణి సుధా!

అవమానాన్ని సహించలేను- అలా అని దిగమ్రింగలేను. నువ్వే నా సర్వస్వం- నీ మీద తప్ప నా కెవ్వరిమీదా- అభిమానం- అనురాగం లేవని- నన్నెందుకు వంచించావు. నీ మాటలన్నీ నిజమనుకుని మోసపోయాను సుధా! మరో ముగ్గురు పరాయి మగాళ్ళ ముందు మొగుడి కెదురుగా- పెళ్ళికాని పరాయి మగాడి ప్రక్కన కూర్చుని- నువ్వు ప్రవర్తించిన తీరుని జీర్ణం చేసుకోలేక పోతున్నాను సుధా!"

"నాకెప్పుడూ అలాంటుద్దేశ్యం లేదండి- ప్లీజ్- నన్ను నమ్మండి..."

వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"నోర్మూయ్" చాచి లెంపకాయి కొట్టాను. అప్పటికి నా మనసు శాంతించింది. కానీ అనవసరంగా- ఆవేశాన్కి లోనై, ఆడదాని వంటిమీద చెయ్యి జేసుకున్నందుకు- ఓ ప్రక్క బాధ చోటు చేసుకుంది.

రాత్రి 12 గం.లు దాటింది. ప్రక్కనే పడుకున్న సుధ ఇంకా వెక్కుతోంది. - నా మనసు జాలితో నిండిపోయింది. పిచ్చి పిల్లా అంటూ దగ్గరగా తీసుకుని- గుండెలమీద పడుకోబెట్టుకుని నన్ను

# మగబుద్ధి

క్షమించు సుధా- కోపంతో - అవమాన భారంతో - ఆవేశపడ్డాను- నిన్ను తప్పుగా అర్థం చేసుకున్నానంటూ ఓదార్చాను సుధ నన్ను లతలా పెనవేసుకుంది.

★ ★ ★ ★

సుధని అక్కడే వదిలి తిరిగి వచ్చేసె. డ్యూటీలో జాయిన్ అయ్యాను. 10 రోజులు గడిచి పోయాయి. నా కప్పుడప్పుడు రామారావు మాష్టారింట్లో జరిగిన సంఘటన గుర్తొచ్చి- మనసు బాధగా మూల్గుతోంది

అనుమానం రాకనే పోవాలి వస్తే అది మనసుని తొలిచేసి- మనిషనే తినేస్తుంది రామారావు మాష్టారు సుధకోసం ప్రజంటు చేసిన ఆర్ట్లు గుర్తొచ్చాయి. అన్నీ ప్రేమికుల చిత్రాలే-

లైలా- మజ్నూ, రాధా కృష్ణ, కోడిపుంజు- పెట్ట, రెండు నెమళ్ళు- వర్షంలో చెట్టు క్రింద తడుస్తున్న ప్రేమికులు, సూర్యాస్తమయపు వెలుగులో - సుదూరాలకి పయనిస్తున్న ప్రేమికులు

ఇవన్నీ సుధ పొందికగా డ్రాయింగ్ రూంలో సర్దింది. - వాటిని చూసి- ఇంతకు ముందు నాకేం అన్పించలేదు- కాని- ఇప్పుడు మాత్రం చాలా అన్పిస్తోంది.

★ ★ ★ ★

కాలం గడిచి పోయింది సుధ అక్కకి కొడుకు పుట్టాడు- నెల రోజులు గడిచిపోయాక సుధ నా దగ్గర కొచ్చేసింది. మా మధ్య మునపటి అన్యోన్యత లేదు. ఆ సంఘటన మర్చిపోదాం అనుకుంటూనే మర్చిపోలేక పోతున్నాం-

కాల గమనంలో మరి కొద్ది రోజులు గడిచి పోయాక- ఆ విషయం- ఇద్దరం మర్చిపోయాం. కానీ మళ్ళీ ఆ విషయం గుర్తుకి రావటాన్కి కారణం- సుధే.

ఆ రోజు ఆగస్టు 15వ తారీఖు. ఆఫీసులో ఎక్కువ పని ఉండటం మూలంగా రాత్రి 11 గం లకి ఇంటి కొచ్చాను టేబిల్ మీద భోజనాలు సర్దటం ప్రారంభించింది సుధ

బెడ్‌రూంలో ఉన్న బీరువాలో డబ్బు పెడదామని సొరుగు తెరిచేసరికి- పెద్ద ఎయిర్‌మైల్ కవరు- దానిమీద రామారావు మాష్టారి అడ్రస్సు.

నా మనసు పాత సంఘటనని గుర్తుకి తెచ్చుకుంది కవరు చేతిలోకి తీసుకున్నాను. లోపల ఇంకా ఉత్తరం పెట్టలేదు. ఖాళీగా ఉన్న కవరు.

అంటే సుధ ఇంకా నన్ను మోసం చేస్తోంది. ఇందులో అనుమానం లేదు- నాకు తెలీకుండా ఆ రాస్కెల్‌కి- ఉత్తరాలు రాస్తోందన్న మాట. వెంటనే అడగాలను కున్నాను... కానీ అడిగితే దబాయించ వచ్చు- చక్కని కథ చెప్పి నన్ను ఇంకా మోసం చెయ్యవచ్చు. పూర్తిగా తెల్సుకుని నిర్ణయం తీసుకోవటం మంచిదనిపించింది.

ఏమీ తెలీనట్లు డైనింగ్ హాల్‌లోకి నడిచాను. ఏదో తిన్నాననిపించుకుని- వచ్చి పడుకున్నాను.

మర్నాడు ఉదయం- ఎనిమిదింటికే ఆఫీసు కెళ్ళి పోయాను. ఆఫీసు పక్కన మా కాలనీ అంతటికీ కలిపి ఒక్కటే పోస్టుబాక్సు ఉంది. నా దృష్టంతా దానిమీదే ఉంది- రెండు మూడు సార్లు బయటకొచ్చి చూసాను. నాల్గోసారి నేనొచ్చేసరికి ఏదో పోస్టు చేసి వెళ్ళిపోతున్న మా ప్రక్క యింటి వాళ్ళ పని పిల్ల కన్పించింది. వెంటనే నాకు కథ అర్థం అయిపోయింది. ఓహో ఇది పోస్టు చేస్తోందన్నమాట- అనుకుంటూ ఆ పిల్లని కేకేసాను.

ఆ అమ్మాయి వచ్చింది- "ఏటండీ?" అంటూ...

'ఏం ఇటొచ్చావ్?" అడిగాను.

"సుధమ్మ గారుత్తరం పోస్టులో ఎయ్యమంటి వచ్చినానండి- డబ్బాలో వేసి పోతున్నానండి" అంది.

"ఆహాఁ-" అని ఆఫీసులోకి వచ్చేసాను.

మధ్యాహ్నం 11-30కి క్లియరెన్స్‌కి పోస్టుమాన్ వచ్చాడు- అతని చేతిలో 5 రూ.ల నోటు పెట్టి సుధ పోస్టు చేయించిన ఉత్తరం తీసుకున్నాను.

కవరులోపల ఉన్న వస్తువు చూసి నాకు మతిపోయింది

అది రామారావు మాష్టారికి సుధ పంపించే రాఖీ- దాంతో పాటు చిన్న కాగితంలో "అన్నయ్యకు ప్రేమతో సుధ" అని అందంగా చెక్కిన అక్షరాలు- నన్ను వెక్కిరిస్తున్నట్లనిపించాయి.

"నన్ను క్షమించు సుధా- నిన్ను అనుమానించినందుకు, అనరాని మాటలన్నందుకు, నీ వంటిమీద చెయ్యి వేసుకున్నందుకు- అన్నింటికి ఒకే ఒక్కసారి నన్ను క్షమించు" అని గొణుక్కున్నాను. □

బరోడా ఆంధ్ర సమితి వారి అధ్వర్యంలో జూలై 12న బరోడాలో శ్రీ బి. ఎ. పట్టాభిరామ్ ఇంద్రజాల ప్రదర్శన జరిగిన సందర్భంగా తీసిన ఛాయా చిత్రం

